


9వ, రోజుకు చేరుకున్న శాకంబరి నవరాత్రి మహోత్సవములు

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
వార్త KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 189 సోమవారం15 జూలై 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -2 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# ప్రభుత్వ పాఠశాలల్ని వెక్కిరిస్తున్నారు

- ప్రతీ సంవత్సరం తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య
- ఏ పాఠశాలలో మౌలిక వసతులు సరిగా లేవు
- ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నాయి
- పాఠశాలల పురోగతి కనిపించడం లేదు
- వర్షాలు పడితే చాలు అపరిశుభ్రత దర్శనమిస్తోంది
- పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారుతుంది
- తరగతి గదుల ప్రక్కనే నిరుపయోగమైన మొక్కలు
- పాఠశాలల్లో కనుమరుగైన ఆట స్థలాలు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

**వరంగల్, జులై 14 (జర్నలిస్ట్ వార్త):**

వరంగల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలపై ఉన్నతాధికారులు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు. పాఠశాలల్లో నిర్వహణపై అధికారులు పర్యవేక్షించడమే కరువైంది. వరంగల్ జిల్లా పరిధిలోని 11 మండలాల్లో 428 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నట్లు ఆన్లైన్ సేవలు చూపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య మాత్రం ఆన్లైన్లో చూపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్య వివరాలను ఆన్లైన్లో చూపించకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే పాఠశాలల పై పట్టింపు లేని విధంగా నిర్వాహకులు, ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించే ప్రయత్నాలు అనునిత్యం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆన్లైన్ ద్వారా ప్రజలకు తెలియజేస్తే విమర్శించే పరిస్థితులు తలెత్తుతాయి. ఒక్క ప్రైవేటు పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే, మొత్తం ప్రభుత్వ పాఠశాలల సంఖ్య ఆశ్చర్యపరిచే విధంగా కనిపిస్తోంది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నెలు గ్రామ శివారులోని ఏకశీలా ఈ టెక్నో స్కూల్ లో దాదాపుగా 2800 వందల మంది విద్యార్థుల సంఖ్య ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులను వారి పాఠశాలకు తరలించేందుకు 53 మినీ బస్సులను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి ప్రైవేట్ పాఠశాలలు ప్రయత్నిస్తున్నాయి. ఏకశిలా పాఠశాలతో పాటు వరంగల్ జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో సిబిఎస్, స్టేట్, ఐఐటి పేరుతో పాఠశాలలు ఏర్పాటు చేసుకుని విద్యను వ్యాపారం చేస్తున్నారు. కొత్త కొత్త



పేర్లతో పాఠశాలలు పునరుద్ధరించగానే హబం శుభం తెలియని తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ బడులలో చేర్పించి, చదువు కొంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. అరకొరగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించి విద్యను కొనుక్కునే స్థోమత లేని తల్లిదండ్రుల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలకు హాజరవుతున్నారు. ఉపాధ్యాయులు మాత్రం వచ్చిన విద్యార్థులకు మాత్రమే చదువు చెబుతాము, సమయం కాగానే తిరిగి ఇంటికి వెళతాము అన్న విధంగా నిర్వాహకులు తయారయ్యారు. మరి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, ప్రభుత్వ బడులను బాగు చేసేందుకు ఎవరు బాధ్యత తీసుకోవాలన్న విషయమై ప్రశ్నార్థకంగా మారింది. మండలం ఏ ఒక్క పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేకపోయాయి. ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కేవలం నిరుపేద కుటుంబాలకు చెందిన వారి పిల్లలు మాత్రమే. ఇలాంటి ఆర్థిక సదుపాయం లేని వ్యవసాయ కూలీల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంటే వారికి మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుంది. మరుగుదొడ్లు, మూత్రశాలలో అపరిశుభ్రంగా తయారయ్యాయి. శుభ్రం చేయడానికి స్కావెంజర్లు లేకపోవడంతో దుర్వాసనలు వీస్తున్నాయి. కనీస మౌలిక వసతులు లేక ప్రభుత్వ పాఠశాలలు దుర్గంతమవుతున్నాయి. ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నాయి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పురోగతి కోసం అనేక ప్రణాళికల రూపొందించి, పాఠశాలలకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. పాఠశాలల వద్దకు వెళితే అభివృద్ధి అన్న మాట ప్రక్కన పెట్టి, పాఠశాలలు ఇంత దారుణమైన స్థితికి చేరాయి ఏంటని ఆశ్చర్యానికి గురి చేసే విధంగా



పాఠశాలలు కనిపిస్తున్నాయి. పరిశుభ్రత పనులు లోపించి, అడవులు తలపిస్తున్న విధంగా పాఠశాల ప్రాంగణం తయారయ్యింది. ప్రభుత్వ పాఠశాలల్లో బాల, బాలికలు ఉంటారు. బాలికల విషయానికొస్తే కనీస మౌలిక వసతుల్లో భాగంగా మలవిసర్జన సౌకర్యం లోపించి, చుట్టుప్రక్కల ఉన్న విద్యార్థుల పిల్లల్లో సేద తీరుతున్నారన్న సంగతి ఆశ్చర్యపరుస్తోంది. కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేనప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేయడం అనే పదానికి అర్థమేమిటో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

## జిల్లా అధికారుల పర్యవేక్షణ ఏది..?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఉన్నత అధకారుల పర్యవేక్షణ ఏదనిప్రభుత్వ పాఠశాలలు, ఉన్నతాధికారుల పనితీరు పట్ల వరంగల్ జిల్లాలో ప్రజలు వెక్కిరిస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, విద్యార్థులకు బోధిస్తున్న తీరు, మధ్యాహ్న భోజన వసతి తదితర వ్యవహారాలపై ఉన్నతాధికారులు ఎందుకు పర్యవేక్షణ నిర్వహించరని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మరి కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడానికి ఉపాధ్యాయులతో పాటు ఉన్నత అధికారుల నిర్లక్ష్యమే కారణమని చెబుతున్నారు.

## పాఠశాలల్లో కనుమరుగైన ఆట స్థలాలు

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో తోడ్పతాయని చెబుతుంటారు. గత గత కొద్ది సంవత్సరాల క్రితం క్రీడలు చూడాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో రెండు కన్నులు సరిపోయేవి కాదు. అన్న చందంగా పాఠశాలల నిర్వహణ కొనసాగుతూ ఉండేది. అలాంటి పాఠశాలలకు ప్రస్తుతం ఆట స్థలాలే కరువయ్యాయి. ప్రతి పాఠశాలలో పీఈటీలు ఉంటారు. వారు విద్యార్థులకు ఏ రకమైన క్రీడల ఆడిస్తున్నారో తెలియని పరిస్థితి ఎదురైంది. వర్షం పడినప్పుడు కొద్దిగా మిగిలి పోయినా స్థలాలు బురదమయంగా తయారయ్యాయి.

## ఆకర్షణీయమైన చదువులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు లేవు

సిబీసీ, స్టేట్, ఐఐటీ చదువులు దాదాపుగా వరంగల్ జిల్లాలోని ప్రతీ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశ పెట్టారు. ప్రతీ పాఠశాలల్లో పరి శుభ్రత పనులు విధిగా చేస్తుంటారు. అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తారు. అయినప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తమకున్న ఇద్దరు పిల్లల్ని ఏకశిలా పాఠశాలలో చదివిస్తున్నానని ఓ పెరెంట్ చెప్పారు. పెద్ద అబ్బాయి 9వ, తరగతి, చిన్న అబ్బాయి 7వ, తరగతి చదువుతున్నారు. ఇద్దరు పిల్లలకు కలిపి సంవత్సరానికి లక్షా యాభై వేల రూపాయలు చెల్లిస్తున్నారు. ఇలాంటి చదువులు, పరిశుభ్రత ప్రమాణాలు పాటించారని ప్రశ్నిస్తున్నారు.






# 9వ, రోజుకు చేరుకున్న శాకంబరి నవరాత్రి మహోత్సవములు

**- భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తజనం**
**- ఆలయ ప్రాంగణంలో భక్తులకు మౌలిక వసతుల ఏర్పాటు**
**- కార్యనిర్వహణ అధికారి కే. శేషు భారతి**



వరంగల్, జులై 14,(జర్నలిస్ట్ వార్త):
కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు ఆదివారం 9వ, రోజుకు చేరుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణ అధికారి కే. శేషు భారతి, ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపిన వివరాల ప్రకారం తిథి అష్టమి. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం ఈ తిథికి అధిదేవుడు శంకరుడు, దశమహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి, అష్టమికి అధిదేవత ఉగ్రప్రభా, షోడశీ క్రమానుసారం త్వరితామాత నిత్యాహ్నికం పూర్తిచేసి, అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి ఉగ్రప్రభా గాను, షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని త్వరితామాత గాను అంకరించి పూజారాధనలు నిర్వహించడం జరిగిందన్నారు. అమ్మవారి విభూతియైన ఈ ఉగ్రప్రభా మాతకే ప్రత్యంగిరా అను నామాంతరం ఉందన్నారు. ప్రళయకాలమునందలి అగ్నితో సమములగు శరీరకాంతులతో ప్రకృతిని, ప్రాణికోటిని బాధించే శక్తులను ఈ మాత నుండి ప్రజ్వల్లిల్లే ప్రళయకాలాగ్ని వంటి జ్వాలలు సంహరిస్తాయన్నారు. పాడి పంటలకు కీడు తలపెట్టు అసురీశక్తులను నశింపజేస్తుందన్నారు. జన్మజన్మాంతరములనుండి సంక్రమించిన పాపం వల్ల భూతగణముచే పీడింపబడుచున్న జీవుల పాపమును నశింపజేసి, మనుష్యులను పీడిస్తున్న అసురీ శక్తులను దూరం చేసి, కాళికా భక్తులకు వరాలిస్తుందన్నారు. ఈ మాత, సకల విధముల అభయమును ప్రసాదించి, భక్తుల మనోరథములీడేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంతో పాటు ఆదివారం కావడంతో భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మంచినీటి సౌకర్యం, ప్రత్యేక క్యూలైన్, ప్రసాదములు తదితర ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.





# బదిలీపై వెళ్లిన తహశీల్దార్ పుణ్యం

## - ముక్కిళ్లకుంట 13 ఎకరాల స్థలం మాయం

## - తీగ లాగినాకొద్ది డొంక కదులుతోంది

**◆ ప్రభుత్వ స్థలాలు, కుంట స్థలాలకు నాలా కన్వర్షన్**
**◆ ఆయన పీరియడ్ లో అసాధ్యమైంది లేదు**
**◆ దాదాపుగా రెవెన్యూ కార్యాలయానికి చెందిన రికార్డు మొత్తం మార్చేశారు**
**◆ ఆయన నిర్వహణకు కిందస్థాయి అధికారుల ప్రోత్సాహం**
**◆ బదిలీపై వెళ్లి చేతులు దులుపుకున్నామానుకున్నారు**
**◆ పరిస్థితుల ప్రభావం ఒక్కొక్కటి బయటపడుతున్నాయి**
**◆ రెవెన్యూ శాఖను బురిడీ కొట్టించిన అధికారిపై ప్రత్యేక విచారణ చేపట్టాలి**



వరంగల్, జులై 14,(జర్నలిస్ట్ వార్త):
వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారులో ముక్కిళ్లకుంట సర్వే నెంబర్ 1435 లోని 13 ఎకరాల స్థలం రూపం లేకుండా పోయింది. 2019- 20 సంవత్సర కాలంలో వర్ధన్నపేట తహశీల్దార్ బాధ్యతలు నిర్వర్తించిన అధికారి కనుకయ్య కొంతమంది వ్యక్తులకు నాలా కన్వర్షన్ చేసి అవకాశం కల్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థలాన్ని పొందిన లబ్ధిదారులు ఇతరులకు అమ్మకాలు చేశారు. గత కొద్ది రోజుల క్రితం అయినవోలు మండలంలో కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించిన వారికి నాలా కన్వర్షన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కారణమైనారు. ఇలా ఒకదాని తర్వాత మరొకటి అన్న చందంగా తీగ లాగినా కొద్ది డొంక కదులుతుంది అన్నట్లుగా ఆయన పని విధానం వెలుగులోకి వస్తుంది. ఇల్లంద గ్రామంలో దాదాపుగా ఆరు వెంచర్లు తయారయ్యాయి. వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ ద్వారా వారికి అవకాశం ఇచ్చి వెంచర్లు వేయడానికి మరో కారణమైంది. ఇలాంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు ఆయన కింద స్థాయి అధికారులు ఆర్ ఐ శ్రీనివాస్, వీఆర్వో అరుణ ల ప్రోత్సాహంతోనే సాధ్యమైందన్న వాదన వ్యక్తం అవుతోంది. ఆపిరియడులో పనిచేసిన అధికారుల తీరుకు నిదర్శనంగా పాత రికార్డులు మొత్తం మాయమయ్యాయని వాదన వినిపిస్తోంది. ఈ కార్యచరణకు వారే కారణమయ్యే ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మండల పరిధిలోని భూముల వివరాలు తెలుసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు వెళ్లి సమాచార హక్కు చట్టం ద్వారా పాత పహానిలు అడిగితే రికార్డులో లేవని సమాధానం ఇస్తున్నారు. కార్యాలయంలో రికార్డులు ఉన్నట్లయితే సమయం తీసుకున్న సరే అడిగిన ఆధారాలను అందించాలి కదా..? లేవంటున్నారంటే గతంలో పనిచేసిన అధికారులు కావాలని రికార్డులు తప్పించారన్న ఆరోపణలు చర్చగా మారాయి. ఆయనతోపాటు క్రింద స్థాయిలో పనిచేసిన అధికారులంతా బదిలీపై ఇతరత్రా కార్యాలయాలకు వెళ్లారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు పాటించి, ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్ళామనుకుని చేతులు దులుపుతున్నారు. ప్రస్తుతం భూమలకు సంబంధించిన ఘర్షణలు రోజురోజుకు ప్రభావితం అవుతున్నకొద్ది కారకులైన అధికారుల జాబితా బయటపడుతోంది. రెవెన్యూ శాఖను బురిడీ కొట్టించి, ఇలాంటి కార్యాచరణకు పాల్పడిన అధికారులపై ప్రత్యేక విచారణ చేపట్టాలి. వారు బాధ్యతలు నిర్వర్తించిన కాలంలో ఇంకా ఇలాంటి ఎన్ని విడ్డూరమైన వ్యవహారాలకు తెర తీశారో ఆరా తీయాలని పలువురు కోరుతున్నారు.

# విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరం

**- శారీరక మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి**
**- ఎస్టి బాలుర హాస్టల్ వార్డెన్ ఎస్.కె యూసుఫ్**



**వర్ధన్నపేట, జులై 13,(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎస్టి బాలుర హాస్టల్ లో ఆదివారం వార్డెన్ ఎస్.కె యూసుఫ్ విద్యార్థులకు వాలీబాల్ క్రీడ నిర్వహించారు. శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు దినాలు కావడంతో స్టడీ అవర్లో కూర్చోబెట్టి, విద్యార్థులతో చదివించారు. సాయంత్రం సమయానికి కొంత సమయం పాటు వివిధ ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని తెలిపారు. క్రీడల వల్ల విద్యార్థులకు శారీరక, మానసిక ఉల్లాసం తోడ్పడుతుందని వివరించారు. రెండు రోజులపాటు సెలవులు కావడంతో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి చదువు కోసం హాస్టల్ వచ్చిన విద్యార్థులు వారి వారి ప్రతిభను కనబరిచి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అవరోధించాలని కోరారు.

# త్వరలోనే మరో డీఎస్సీ...

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ జులై 14,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిరుద్యోగులకు శుభవార్త చెప్పారు. త్వరలోనే మరో డీఎస్సీ ప్రకటిస్తామని వెల్లడించారు. ఇప్పటికే 11 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో ప్రకటించే డీఎస్సీ ద్వారా మరో 5 వేల నుంచి 6 వేల పోస్టుల వరకు భర్తీ చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నదే ఉద్యోగాల కోసం అని, నిరుద్యోగులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్టు గుర్తించామని, వెంటనే డీఎస్సీ ప్రకటించామని గుర్తుచేశారు. ఇదే చివరి డీఎస్సీ కాదని, మరిన్ని డీఎస్సీలు ప్రకటిస్తామని తెలిపారు. త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే తమ లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు.

# పెండింగ్ లో పెట్టిన రూ.7.90 కోట్ల ఎక్స్ గ్రేషియా విడుదల

## ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ఊరటనిచ్చే నిర్ణయం ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



రంగారెడ్డి జులై 14,(జర్నలిస్ట్ వార్త):
తాళ్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు మరణించిన కల్లు గీత కార్మికుల కుటుంబాలకు గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన రూ. 7. 90 కోట్ల ఎక్స్ గ్రేషియా మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడ గ్రామంలోని తాటి చెట్ల వనంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. తాటిచెట్లు ఎక్కేటప్పుడు గీత కార్మికులు ప్రమాదాల బారినపడకుండా రక్షించే కాటమయ్య రక్షణ కవచంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్స్ గ్రేషియా పెండింగ్ అంశంపై కల్లు గీత కార్మికుల కుటుంబాలకు ఊరటనిచ్చే ప్రకటన చేశారు. అంతేకాదు, గీత కార్మికులు తాటి చెట్ల మీద నుంచి పడకుండా తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటి ఆరు పరికరాలతో కూడిన కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కిట్లను రూపొందించింది ఎవరో కాదు... గతంలో పర్వతారోహణ చేసి తెలంగాణ ఖ్యాతిని ఘనంగా చాటిన మాలావత్ పూర్ణ. ఈ సందర్భంగా మాలావత్ పూర్ణ బృందాన్ని రేవంత్ రెడ్డి అభినందించారు.